

కొత్తరకం.. ఆశాజనకం

ఆపిల్‌బేర్, డ్రాగన్‌ఫ్రూట్ సాగులో యువ రైతులు రాణిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధిస్తూ పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. 8లో▸



వేసవిలో వన్యప్రాణుల సంరక్షణ

వేసవిలో వన్యప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో నీటికుంటల వద్ద ఉప్పుగడ్డలు ఏర్పాటు చేస్తున్నారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0 /17.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా చలిగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

పోడు పట్టాల కసరత్తు



వేమనపల్లి మండలం దస్నాపూర్‌లో పోడు భూముల పరిశీలన చేస్తున్న ఎఫ్‌ఆర్సీ(ఫైల్)

- అర్జీదారుల నుంచి అర్హుల వడపోత
- కమిటీల సమక్షంలోనే జాబితా వెల్లడి
- అర్హులను గుర్తించే పనిలో కమిటీలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పోడు భూముల పట్టాల పంపిణీ కసరత్తు సాగుతోంది. ఇటీవల రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అర్హులైన వారికి పట్టాలు పంపిణీ చేస్తామని ప్రకటించడంతో ముమ్మరంగా జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం పోడు సమస్య పరిష్కరించేందుకు జీవో నంబరు 140 జారీ చేసింది. అటవీ భూములు సాగు చేస్తున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. గ్రామ, మండలం, డివిజన్ స్థాయిలో ఫారెస్ట్ రైట్స్ కమిటీ(ఎఫ్‌ఆర్సీ) ఏర్పాటు చేసి ఆయా స్థాయిల్లో పరిశీలన చేసింది. మోకాపై ఉన్న రైతుల వివరాలు తీసుకుని పరిశీలన చేశారు. గతంలో అటవీ హక్కుల చట్టం 2005 ప్రకారమే సాగులో ఉన్న గిరిజన రైతులకు పట్టాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మరోసారి అర్హులను గుర్తించేందుకు ఈ ప్రక్రియ జరుగుతోంది. ఇందుకోసం ఐటీడీఏ, అటవీ, రెవెన్యూ, పంచాయతీ శాఖ పర్యవేక్షణలో గతంలోనే సర్వేలు, పరిశీలనలు జరిగాయి. అయితే దరఖాస్తుల సమయంలో పెద్ద ఎత్తున అర్జీలు వచ్చాయి. ఏళ్లుగా సాగు చేస్తున్న వారితోపాటు మరికొందరు దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లాలో అటవీ సాగు భూములను సాగు చేస్తున్న 13మండలాల పరిధిలో 88గ్రామ పంచాయతీల్లో 120ఆవాసాల్లో 36,452 ఎకరాల్లో పరిశీలన జరిగాయి.

అర్జీలకు అర్హులకు భారీ వ్యత్యాసం

చాలామంది పోడు భూముల పట్టాల కోసం గిరిజన, గిరిజనేతరులు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వేలాది సంఖ్యలో అర్జీలు వచ్చాయి. అర్హులు, దరఖాస్తుల సంఖ్యకు భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. అర్హుల గుర్తింపు కోసం ఎఫ్‌ఆర్సీలు గ్రామ సభలు నిర్వహించాయి. ఇందులో మొదట అర్హుల జాబితా ప్రకారం జిల్లాలో సగాని కంటే తక్కువ ఎకరాల్లోనే అర్హులను గుర్తించినట్లు సమాచారం. పూర్తి స్థాయిలో జాబితా సిద్ధం చేసేందుకు మరో మారు పరిశీలనలు చేయాలని రాష్ట్ర స్థాయి నుంచి ఆదేశాలు రావడంతో రెవెన్యూ, అటవీ శాఖ సమన్వయంతో శాస్త్రీయంగా సర్వే చేస్తున్నారు. దీంతో ఈ సంఖ్య మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా అటవీ శాఖ ఉపయోగిస్తున్న శాటిలైట్ మ్యాపులతో అడవిలో పచ్చదనం కోల్పోయిన ప్రాంతం, అంతకు ముందు ఉన్న ప్రాంతంతో పోల్చుతూ నమోదు చేస్తున్నారు. ఇక గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వడంపై స్పష్టత రాలేదు. దరఖాస్తులు తీసుకునే సమయంలోనే 1930కంటే ముందు నుంచి భూములు సాగులో ఉన్నట్లు లేదా మూడు తరాల వారు సాగులో ఉన్నట్లుగా రుజువు కోసం ఆధారాలు అడిగారు. ఈ క్రమంలో అర్హుల జాబితా సిద్ధం చేసేందుకు కసరత్తు జరుగుతోంది.

కమిటీల ముందే వెల్లడి

దరఖాస్తుదారులు వారు సాగు చేస్తున్న భూములకు పోడు పట్టాలు ఇచ్చేందుకు అర్హులా? కాదా? అనేది వారి సమక్షంలోనే వెల్లడి చేయాలని ఆదేశాలు రావడంతో కమిటీల ముందే అర్హుల జాబితాను ప్రకటించనున్నారు. అనర్హులైతే ఎందుకు తాము అనర్హులమో వారికి స్పష్టంగా తెలియజేయాలని అధికారులు నిర్ణయించారు. పట్టాల పంపిణీలో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా జటిలమైన పోడు ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వీలైనంత తొందరలోనే అర్హుల తుదిజాబితాను ప్రకటించే అవకాశం ఉంది.

బెల్లంపల్లి ఏసీపీగా సదయ్య



ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏసీపీగా పి.సదయ్య నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. బెల్లంపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్ గత నెల 28న బదిలీ కాగా ఆయన స్థానంలో మహబూబాబాద్ ఏసీపీగా పని చేస్తున్న సదయ్యను బెల్లంపల్లి ఏసీపీగా నియమించారు. మరో మూడు రోజుల తర్వాత ఉద్యోగ బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మహబూబాబాద్ జిల్లాలో హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర చేస్తుండడంతో బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో గు రు, శుక్రవారాల్లో పాదయాత్ర సాగనుంది. పాదయాత్ర పూర్తి కాగానే బెల్లంపల్లికి రానున్నట్లు సద య్య తెలిపారు. శనివారం లేదా సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

సబ్ డివిజన్‌లో పని చేసిన అనుభవం

సదయ్యకు బెల్లంపల్లి పోలీసు సబ్ డివిజన్ పరిధి లో పని చేసిన అనుభవం ఉంది. బెల్లంపల్లి రూరల్ సర్కిల్ పరిధిలోని తాళ్లగురిజాల ఎస్సైగా 1998–99లో ఏడాదిన్నరపాటు పని చేశారు. ఆ తర్వాత ఇదే డివిజన్‌లోని మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా 2014నుంచి 2017 వరకు మూడేళ్లపాటు పని చేసి బదిలీ అయ్యారు. పదోన్నతిపై ఏసీపీగా మహబూబాబాద్‌కు బదిలీ కాగా తిరిగి బెల్లంపల్లికి రానున్నారు. నిషేధిత మావోయిస్టు పార్టీ కార్యకలాపాలు అణిచి వేయడంలో, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రత్యేకించి కోల్‌బెల్ట్ ప్రాంతంపై సదయ్యకు పరిపూర్ణమైన అవగాహన ఉంది.

న్యూస్‌రీల్

పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరికి పదోన్నతి



రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరికి డీ ఐజీగా పదోన్నతి లభించింది. ఐపీఎస్‌ల పదోన్నతుల్లో భాగంగా 2009 బ్యాచ్‌కు చెందిన ఆమెకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ఆమె డీఐజీ హోదా లోనే రామగుండం పోలీసు కమిషనర్‌గా కొనసాగనున్నారు. గత నెల 26న ఆమె కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.

నిర్ణీత సమయంలో బియ్యం పంపిణీ చేయాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న, అదనపు కలెక్టర్

నస్పూర్: పేదల కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి ప్రతీ నెల సమయానికి చౌకధరల దుకాణాలకు రేషన్ బియ్యం పంపిణీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌకధరల దుకాణాలకు కేటాయింపుల ప్రకారం అందాల్సిన బియ్యం తక్కువ ఉంటే ఇతర జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకుని బియ్యాన్ని తీసుకుని దుకాణాలకు పంపిణీ చేయాలని అన్నారు. అనంతరం సుందరయ్య కాలనీలోని 17వ నంబరు చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేశారు. బోర్డు లేకపోవడంతో రూ.500 జరిమానా విధించడంతోపాటు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జ్యోతిని ఆదేశించారు. చౌకధరల దుకాణాల్లో చక్కెర పంపిణీకి డీలర్లతో చక్కెర కోటా కోసం డీడీలు కట్టించే బాధ్యత డీటీలదేనని తెలిపారు.

జిల్లా పశు వైద్యుల సంఘం ఎన్నిక





అధ్యక్షుడు భూమయ్య   డాక్టర్ సరిత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా పశు వైద్యుల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ మంచాల భూమయ్య(తాండూర్), ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఈ.సరిత(దొనబండ), గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ శంకర్‌లింగం(మంచిర్యాల), కోశాధికారిగా డాక్టర్ శాంతిరేఖ(హాజీపూర్), ఉపాధ్యక్షులుగా డాక్టర్ సతీష్(జైపూర్), డాక్టర్ పవన్(కోటపల్లి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రమేష్‌కుమార్, సహాయ సంచాలకులు డాక్టర్ శంకర్, పశు వైద్యులు అభినందించారు.

భాషా పండితుల సహాయ నిరాకరణ



సహాయ నిరాకరణలో పాల్గొన్న పండితులు

తాండూర్: భాషా పండితుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా చేపట్టిన సహాయ నిరాకరణ కొనసాగుతోంది. బుధవారం మండల కేంద్రంలో భాషా పండితులు 9, 10వ తరగతుల బోధన నిలిపి వేసి నిరసన వ్యక్తం చేశారు. టాబ్‌చార్ట్ ప్రకారంగా 6, 7, 8వ తరగతుల విద్యార్థులకు మాత్రమే బోధన చేస్తున్నారు. సహాయ నిరాకరణకు ప్రధానోపాధ్యాయులు సంఘీభావం ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా భాషా పండితులు మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన బదిలీల్లో భాగంగా భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించకపోవడం దారుణమని అన్నారు. వెంటనే ఆ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సత్యనారాయణ, సురేందర్, నారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌స్వామి, భాషా పండితులు పాల్గొన్నారు.

తల్లి కాటికి.. తండ్రి కటకటాల్లోకి..!

- ఒంటరిగా మిగిలిన ఇద్దరు పిల్లలు
- మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ అరెస్టు
- భార్య ఆత్మహత్య కేసులో రిమాండ్



తల్లి మృతదేహం వద్ద పిల్లలు



ఆసుపత్రి వద్ద జ్యోతి కుటుంబ సభ్యులు

మంచిర్యాలక్రైం: ఏం జరిగిందో తెలియదు గానీ ఆ తల్లి ఉరేసుకుని ఊపిరి తీసుకుంది. కన్నపిల్లలపై మమకారాన్ని చంపుకుని కాటికి చేరింది. తండ్రిపై కేసు నమోదు కావడంతో కటకటాల్లోకి వెళ్లాల్సి వచ్చింది. తల్లిని కోల్పోయి.. తండ్రికి దూరమైన ఇద్దరు చిన్నారులు ఒంటరిగా మిగిలారు. తల్లి మృతదేహం వద్ద దిగాలుగా నిలబడిన పిల్లలను చూసి అక్కడున్నవారు చలించిపోయారు. మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ నల్లమల్ల బాలకృష్ణ భార్య జ్యోతి (32) మంగళవారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. బుధవారం ప్రభుత్వ ఆస్పత్రిలో జ్యోతి మృతదేహం వద్ద బంధువులు రోదిస్తుండగా.. ఆమె పిల్లలు రిత్విక్(8), భవిష్య(6) బిక్కుబిక్కుమంటూ అమాయకపు చూపులు చూస్తుండడం అక్కడున్న వారిని కలిచివేసింది. జ్యోతి ఆత్మహత్యకు భర్త బాలకృష్ణ వేధింపులే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మంగళవారం రాత్రి 12గంటల ప్రాంతంలో జ్యోతి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాలకృష్ణపై వరకట్న వేధింపులు 498(ఏ), ఆత్మహత్యకు ప్రేరేపణ 306 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అతడిని మంచిర్యాల కోర్టులో హాజరుపర్చగా 14రోజుల రిమాండ్ విధించారు.

అమ్మమ్మ చెంతకు చిన్నారులు..

బాలకృష్ణను రిమాండ్‌కు తరలించడంతో ఇద్దరు చి న్నారులు రిత్విక్, భవిష్యలను అమ్మమ్మ గంగవరం రవీంద్రకుమారి, తాత రాంబాబు చెంతకు చేరారు. తల్లి మృతదేహంతో మంచిర్యాల నుంచి వెళ్లిపోయారు. కాగా, ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని స్థానిక బీజేపీ నాయకుడు తులా మధుసూదన్‌రావు డిమాండ్ చేశారు.

పోస్టుమార్టం అడ్డగింత

మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో జ్యోతి మృతదేహానికి పోస్టుమార్టం చేయకుండా ఆమె తల్లిదండ్రులు, బంధువులు అడ్డుకున్నారు. ఆత్మహత్యకు కారణమైన వారిపై కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. దీంతో పోలీసులు జ్యోతి భర్త బాలకృష్ణ, అతడి తండ్రి నల్లమల్ల మురళి, తల్లి కన్నమ్మ, తమ్ముడు హరికృష్ణ, అక్కాచెల్లెలు కృష్ణకుమారి, జ్యోతిపై కేసు నమోదు చేశారు. అనంతరం పోస్టుమార్టానికి మృతురాలి అంగీకరించారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని బాలకృష్ణ స్వగ్రామం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కేశవపురం తరలించారు. అక్కడ ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు.

మెసేజ్ చేసి డిలీట్

జ్యోతి ఆత్మహత్యకు ముందు వాట్సాప్‌లో ఓ మెసేజ్ చేసి డిలీట్ చేసిందని బాలకృష్ణ రోదించడం, ఉదయం 9.30గంటలకు తన తల్లికి ఫోన్ చేసిన జ్యోతి చనిపోయే ముందు ఏదైనా చెప్పాలనే ప్రయత్నం చేసి ఉంటుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లిన సమయంలో బాలకృష్ణతోపాటు ఇంటి పక్కన ఉండే అతడు మాత్రమే ఉన్నారు. ఆ సమయంలో ఆధారాలు కనిపించకుండా చేసి ఉండొచ్చనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనకు ముందు రోజు రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగినట్లు, జ్యోతిని బాలకృష్ణ కొట్టిన తీరును కూతురు భవిష్య మంచిర్యాల సీఐ నారాయణ్‌నాయక్‌కు వివరించింది. దర్యాప్తు కోసం పోలీసులు జ్యోతికి సంబంధించిన రెండు ఫోన్లు, బాలకృష్ణ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

ఆమె మృతిలో అనుమానాలెన్నో..!



పిల్లలతో జ్యోతి(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఆరు నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవ చివరికి ఓ నిండు ప్రాణం బలి తీసుకుంది. మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ భార్య జ్యోతి(32) మరణం వెనక రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'అమ్మా నన్ను చంపేసేలా ఉన్నాడు' అని మృతురాలు తన తల్లితో చనిపోయే రోజే బాధగా ఫోన్‌లో చెప్పడం, 'నాన్న అమ్మను తరచూ కొడుతూ, తిడుతున్నారని' చిన్నారి భవిష్య చెప్పడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. వీటితోపాటు గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలపై పంచాయతీలు పెడుతున్నట్లుగా తెలుస్తోంది. మృతురాలి తల్లితండ్రులు పలుమార్లు కమిషనర్‌కు నచ్చజెప్పే ప్రయత్నం చేసినట్లు చెబుతున్నారు. ఇతర మహిళలతో సంబంధాలు నెరపడంపైనా ఆరోపణలు ఉన్నాయి. గతంలో నిర్మల్ పని చేసినప్పుడు కంటే మంచిర్యాలకు వచ్చాక, ఆర్థికంగా బలపడినట్లుగా చెబుతున్నారు. మొదట కానిస్టేబుల్ ఉద్యోగంతో మొదలై, గ్రూప్ వచ్చి కమిషనర్ స్థాయికి చేరడంతో తన హోదాకు తగిన భార్య కాదని, అతనితోపాటు కుటుంబీకులు కూడా మృతురాలిపై ఆరోపణలు చేయడం పట్ల ఆత్మహత్యనా? లేక హత్యనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఓ ఉన్నతాధికారి భార్య మరణం కావడంతో పోలీసు ఉన్నతాధికారులు సైతం ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించారు. సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కాల్‌డేటా, వాట్సాప్ చాట్, చనిపోవడానికి ముందు రోజు జరిగిన వాటిపై వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఆత్మహత్యకు ప్రేరేపణ, వరకట్న వేధింపుల సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలని స్థానికులు కోరుతున్నారు.

'నర్సింగ్' ప్రత్యక్ష తరగతులు ఆలస్యం



మంచిర్యాలలోని కాలేజీ రోడ్డులో నర్సింగ్ కాలేజీ కోసం సిద్ధం చేస్తున్న అద్దె భవనం

- నర్సింగ్ కాలేజీ నిర్వహణకు అద్దె భవనం ఎంపిక
- శాశ్వత భవనానికి రూ.40 కోట్లు కేటాయింపు
- భూదాన్ భూమిలో కేటాయించిన స్థలంపై సందిగ్ధం

మంచిర్యాలటౌన్: జిల్లాకు మంజూరైన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రత్యక్ష తరగతులు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అద్దె భవనాన్ని కళాశాలకు అనుగుణంగా చేపట్టిన మరమ్మతు పనులే ఆలస్యానికి కారణంగా తెలుస్తోంది. కళాశాలకు భవనం కేటాయించకపోవడంతో అద్దె భవనాన్ని కాలేజీ నిర్వహణకు ఎంపిక చేశారు. రెండున్నర నెలలుగా కాలేజీ నిర్వహణకు అందుబాటులోకి రాలేదు. ఈ విద్యాసంవత్సరం నర్సింగ్ మొదటి సంవత్సరంలో 60 మంది విద్యార్థులు ప్రవేశం పొందగా ఇప్పటికీ ప్రత్యక్ష తరగతులు నిర్వహించడం లేదు. తాత్కాలిక భవనం ఏర్పాటు చేయకుండానే మొదటి సంవత్సరం అడ్మిషన్లు పూర్తి చేశారు. తరగతులు ప్రారంభమయ్యే సమయానికి గుర్తించిన భవనాన్ని సిద్ధం చేయలేకపోయారు. దీంతో విద్యార్థులు ఇళ్లలో ఉండి ఆన్‌లైన్ జూమ్ విధానంలో పాఠాలు వింటున్నారు. భవనం అందుబాటులోకి వచ్చేందుకు మరో 20రోజులకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో రెండున్నర నెలలు ఆన్‌లైన్‌లో సాగిపోతోంది. సంక్రాంతి తర్వాత ప్రత్యక్ష తరగతులు ఉంటాయని కళాశాల సిబ్బంది తెలుపగా ఈ నెల 13లోగా అద్దె భవనం సిద్ధం చేసి ఇవ్వాలని భవన యజమానిని కళాశాల ప్రిన్సిపాల్ కోరారు. ప్రస్తుతం ప్రిన్సిపాల్‌తోపాటు ముగ్గురు రెగ్యులర్ సిబ్బంది ఉండగా, మరో నలుగురిని ఔట్‌సోర్సింగ్ ద్వారా తీసుకున్నారు. 60 మంది విద్యార్థినులకు అన్ని రకాల మౌలిక వసతులు ఉండేలా భవనంలో నిర్మాణాలు చేపడుతున్నారు. నెలాఖరు వరకు భవనం సిద్ధం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్నానాల గదులు, వంట షెడ్లు, డైనింగ్ హాల్ నిర్మాణంతోపాటు తరగతి గదులు అదే భవనంలో ఉండేలా సిద్ధం చేయడం వల్ల పనులు ఆలస్యం అవుతున్నట్లు కళాశాల సిబ్బంది చెబుతున్నారు. కాలేజీ, హాస్టల్, కళాశాల అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం అన్ని కూడా ఒకే భవనంలో ఉండేలా సిద్ధం చేస్తున్నారు.

13 నుంచి ప్రత్యక్ష తరగతులు



ప్రభుత్వ నర్సింగ్ కాలేజీకి అనుగుణంగా అద్దె భవనాన్ని సిద్ధం చేస్తున్నాం. ఈ నెల 13లోగా భవనాన్ని అప్పగించాలని చెప్పాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్‌లో పాఠాలు బోధిస్తున్నాం. అద్దె భవనం అందుబాటులోకి వస్తే కాలేజీ, హాస్టల్, కార్యాలయం అన్ని కూడా ఒకేచోట ఉంటాయి.

– ఫాతిమా జాలియెట్, మంచిర్యాల ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్

శాశ్వత భవనం ఎక్కడో....?

మంచిర్యాలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేసినప్పుడే అనుబంధంగా నర్సింగ్ కళాశాల మంజూరు చేశారు. మెడికల్ కళాశాల, ఎంసీహెచ్, నర్సింగ్ కళాశాలల నిర్మాణానికి కాలేజీరోడ్డులోని భూదాన్ భూమి 707, 708 సర్వే నంబర్లలో 22 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటా యించింది. మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని రూ. 17.80 కోట్లతో నిర్మించారు. వైద్య కళాశాలను తాత్కాలికంగా దాదాపుగా రూ.14 కోట్లతో ఏర్పా టు చేశారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రం వద్దనే నర్సింగ్ కళాశాల నిర్మాణం కోసం రూ.40 కోట్లు కేటాయించగా, వాటి నిర్మాణానికి గత ఏడాది మార్చి 4న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు భూమి పూజ చేశారు. అదే ఏడాది కురిసిన భారీ వర్షాలతో మాతాశిశు ఆరోగ్య కేంద్రం ముని గిపోగా, నర్సింగ్ కళాశాల, మెడికల్ కళాశాలలకు కేటాయించిన స్థలం మొత్తం వరద నీటిలో మునిగింది. దీంతో మెడికల్ కళాశాలను జిల్లా కేంద్రంలోని సాయికుంటలో 14.13 ఎకరాల్లో నిర్మించేందుకు స్థలాన్ని మార్చారు. నర్సింగ్ కాలేజీ ఎక్కడ నిర్మిస్తారనే దానిపై ఇంకా ఎలాంటి స్థలాన్ని గుర్తించలేదు. ఎంసీహెచ్ సమీపంలో నిర్మిస్తే ఏటా కురిసే వర్షాలకు మునిగిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రత్యామ్నాయంగా మరోచోట స్థలాన్ని కేటాయించి శాశ్వత భవనాన్ని నిర్మించాల్సి ఉంది. మొదటి ఏడాది 60 మంది విద్యార్థులతో నర్సింగ్ కళాశాల ప్రారంభించగా, ఏటా 60 చొప్పున పెరుగుతూంటారు. నాలుగేళ్ల కోర్సులో 240 మంది విద్యార్థులు వస్తే ప్రస్తుతం ఉన్న అద్దె భవనంలో కాలేజీ నిర్వహణ కష్టంగా మారనుంది. నర్సింగ్ కాలేజీ కార్యకలాపాలను ప్రస్తుతం మెడికల్ కాలేజీ నుంచే నిర్వహిస్తున్నా రు. శాశ్వత భవనం నిర్మిస్తేనే నర్సింగ్ విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులతో కూడిన భవనం అందుబాటులోకి వచ్చేందుకు అవకాశం ఉంది.

సమీకృత కలెక్టరేట్ పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న, కలెక్టర్ బాదావత్ సంతోష్

నస్పూర్: పట్టణంలో చేపట్టిన సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను త్వరగతిన పూర్తి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికా రులను ఆదేశించారు. బుధవారం ఆయన అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, ఆర్అండ్‌బీ ఈఈ రాముతో కలిసి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ చాంబర్, వివిధ శాఖల గదులు, కారిడార్, కార్యాలయం ఆవరణ నిర్మాణ పనులు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అన్ని రకాల సేవలు ఒకే చోట లభించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణాలు చేపట్టిందని తెలిపారు. విద్యుత్ సరఫరా, అంతర్గత రోడ్లు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు.

మొక్కలను సంరక్షించాలి

నస్పూర్: హరితహారం కార్యాక్రమంలో భాగంగా జాతీయ రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం ఆయన శ్రీరాంపూర్ నుంచి జైపూర్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు

మంచిర్యాలఅగ్రికల్చర్: డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయిస్తామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇళ్లను పరిశీలించారు. జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు 90 ఇళ్లను అందజేస్తామని తెలిపారు. ఇంకా 390 ఇళ్ల పంపిణీకి సిద్ధం చేసినట్లు తెలిపారు. రహదారులు, భవనాల శాఖ ఈఈ రాము పాల్గొన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న నాయికులు, విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి ఆరోపించారు. విద్యారంగ అభివృద్ధిపై అసెంబ్లీలో చర్చించాలని బుధవారం మంచిర్యాలలో ర్యాలీ నిర్వహించి ఐబీ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచలేదని పేర్కొన్నారు. గత సంవత్సరం కేటాయింపుల కంటే ఈ బడ్జెట్‌లో 0.31శాతం నిధులు ఎక్కువ అనిపించినా పెండింగ్‌లో ఉన్నా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు, విశ్వవిద్యాలయాల అభివృద్ధి, మన ఊరు–మన బడి వంటి ముఖ్య పథకాలకు సరిపోవని తెలిపారు. నస్పూర్ మండల కార్యదర్శి అభినవ్, జిల్లా బాధ్యుడు శ్రావణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌కు ముగ్గురు రాజీనామా

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన ముగ్గురు కాంగ్రెస్ నాయకులు బుధవారం పార్టీకి రాజీనామా చేశారు. పార్టీలో నెలకొన్న గ్రూపు తగాదాలతో విసుగు చెంది రాజీనామా చేస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ.అఫ్జల్, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గెల్లి జయరాం యాదవ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఖైరి శ్రీనివాస్ ప్రకటించారు. పార్టీతో పాటు పదవులకు సైతం రాజీనామా చేసినట్లు వారు పేర్కొన్నారు.

ఎవరికి వారే యమునా తీరే..

బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీలో ఐక్యత కొరవడింది. ముఖ్య నాయకులు గ్రూపులుగా విడిపోయి ఆధిపత్యం చెలాయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కిందిస్థాయి శ్రేణులను పట్టించుకునే వారు కరువయ్యారని కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

డీసీపీని కలిసిన జీఎం



డీసీపీ రాంనాథ్‌కేకన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): మంచిర్యాల డీసీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సుధీకర్ రాంనాథ్ కేకన్‌ను శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం మంచిర్యాలలోని డీసీపీ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, జైపూర్ ఏసీపీ నరేందర్, సింగరేణి ఏరియా సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండలంలోని గుల్లకోట స్టేజీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. కన్నెపల్లి మండలం దాంపూర్ గ్రామానికి చెందిన శశికుమార్, రవికుమార్, వినోద్ లక్సెట్టిపేట నుంచి ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా గుల్లకోట స్టేజీ వద్ద ఎదురుగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏసీబీ అధికారుల ఫోన్ నంబర్ల మార్పు

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు ఏసీబీ ఇన్స్‌పెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీబీ డీఎస్పీ ఫోన్ నం. 91543 88963, ఇన్స్‌పెక్టర్ 91543 88964, ఇన్స్‌పెక్టర్ 91543 88965గా మారినట్లు ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి అవినీతి అధికారులకు సంబంధించిన సమాచారాన్ని ఈ నంబర్ల ద్వారా అందించాలని ఆయన సూచించారు.

ప్యాసింజర్ రైళ్లు రద్దు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల మీదుగా నడుస్తున్న రెండు ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 8 నుంచి 14 వరకు రద్దు చేసినట్లు స్థానిక రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వీరూర్, మాకుడి రైల్వేస్టేషన్ల మధ్య మూడోలైన్ నిర్మాణ పనులు నడుస్తున్నందువల్ల కాజీపేట నుంచి బల్లార్ష, బల్లార్ష నుంచి కాజీపేట వెళ్లాల్సిన ప్యాసింజర్ రైలు రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సిర్పూర్‌టౌన్-కాజీపేట, సిర్పూర్‌టౌన్-భద్రాచలంరోడ్, కరీంనగర్-సిర్పూర్ టౌన్, సిర్పూర్‌టౌన్-కరీంనగర్ మధ్య నడవాల్సిన ప్యాసింజర్ రైళ్లు బెల్లంపల్లి వరకు నడుస్తాయన్నారు.

కొత్తరకం..ఆశాజనకం



కలెక్టర్‌కు డ్రాగన్ ఫ్రూట్ అందజేస్తున్న రైతు సాయితేజ (ఫైల్)

- ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్ సాగులో రాణిస్తున్న యువరైతులు
- పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న వైనం



ఆపిల్ బేర్ చూపిస్తున్న రైతు రాజన్న

నెన్నెల(బెల్లంపల్లి): వ్యవసాయంలో సంప్రదాయ పంటలు సాగుచేస్తే చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు, ఈదురుగాలులు, ఇతర కారణాలతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని భావించిన యువ రైతులు కొత్తరకం పంటల సాగుకు ముందుకు వచ్చారు. ప్రభుత్వం అందించిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్ తోటలు సాగు చేసి లాభాలు గడిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు జిల్లాలోని యువ రైతులు.

ఆపిల్ బేర్ రూపు.. తెలంగాణ సేపు

మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూర్ డివిజన్లలో పది మంది రైతులు 20 ఎకరాల్లో ఆపిల్ బేర్ సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి సాధిస్తున్నారు. తెలంగాణలో ఈ పండ్లకు మంచి ఆదరణ లభిస్తోంది. ఆరోగ్య రీత్యా బాగా ఉపయోగపడే పండ్లుగా గుర్తించడంతో పట్టణాల్లో వీటికి డిమాండ్ ఉంది. రేగుజాతికి చెందిన ఈ మొక్కలు ఎలాంటి వాతావరణ పరిస్థితినైనా తట్టుకుంటాయి. సాగునీరు కొంత మొత్తంలో అందించాల్సి ఉంటుంది. ఇతర పంటలతో పోల్చితే సాగుకు తక్కువ పెట్టుబడి అవుతుంది. మామిడి పంటలకు అనుకూలమైన నెన్నెల మండలం అవుడం గ్రామానికి చెందిన యువ రైతు ఆనందపు రాజన్న తనకున్న ఆరేళ్ల క్రితం ఆపిల్ బేర్ సాగు ప్రారంభించాడు. హైదరాబాద్‌లోని వ్యవసాయ క్షేత్రం నుంచి రాయితీపై ఒక్కో మొక్కను రూ.40కి కొనుగోలు చేశాడు. తనకున్న రెండెకరాల్లో నాలుగు వందల మొక్కలు నాటాడు. మొక్కల ఖర్చు, సాగు, పంట చుట్టూ సోలార్ పెన్సింగ్‌కు రూ.లక్ష వరకు ఖర్చు చేశాడు. మొక్కలు నాటిన 9 నెలల నుంచే క్రాప్ రావడం ప్రారంభించింది. ఏటా నవంబర్ నుంచి కాయలు కోతకు వచ్చి మార్చి వరకు దిగుబడిని అందిస్తున్నాయి. ఏడాదికి సుమారు రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. పంటను సేంద్రియ ఎరువుతో సాగు చేస్తున్నామని రైతు రాజన్న తెలిపారు.

జిల్లా నేలలు అనుకూలం



ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్ సాగుకు మన జిల్లా నేలలు అనుకూలంగా ఉన్నాయి. పంటల సాగుకు జిల్లా రైతులు ముందుకు వస్తున్నారు. పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. సేంద్రియ పద్ధతిలో సాగు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సుభ్రజ, హార్టికల్చర్ ఆఫీసర్, బెల్లంపల్లి

డ్రాగన్‌తోట... లాభాల బాట

జిల్లాలోని బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూర్ డివిజన్‌లోని 30 మంది రైతులు 68 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. ఆరోగ్యపరంగా ఎన్నో ప్రయోజనాలు ఉన్న డ్రాగన్ పండ్లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఒక్కసారి సాగు చేస్తే 30 ఏళ్ల వరకు పంట దిగుబడి పొందవచ్చని తెలుసుకున్న రైతులు సాగుకు శ్రీకారం చుట్టారు. కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన అన్నదమ్ములు జాడి సాయి తేజ, విశ్వతేజ నాలుగేళ్ల క్రితం డ్రాగన్ ఫ్రూట్ సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. హైదరాబాద్‌లోని నర్సరీలోంచి ఒక్కో మొక్కకు రూ.120 చెల్లించి నాలుగు వేల మొక్కలు కొనుగోలు చేసి రెండెకరాల్లో నాటారు. ఆ తోటకు తమ తండ్రి జ్ఞాపకార్థంగా ‘జాడి రాజలింగు డ్రాగన్‌ఫ్రూట్ ఫామ్’ అని పేరు పెట్టారు. నాటిన రెండేళ్లకు క్రాప్‌కు వచ్చింది. నాగ్‌పూర్, గోదావరిఖని, మంచిర్యాల, వరంగల్, హైదరాబాద్, తదితర పట్టణాల్లోని మార్కెట్లకు పండ్లను తరలిస్తున్నారు. గతేడాది రూ.3 లక్షలు, ఈ ఏడాది రూ.5 లక్షల ఆదాయం వచ్చినట్లు వారు పేర్కొన్నారు. అన్నదమ్ములిద్దరూ ఒకవైపు సివిల్ పరీక్షలకు ప్రిపేర్ అవుతూనే డ్రాగన్ ఫ్రూట్ తోటను సాగు చేస్తున్నారు. మన నేలలు డ్రాగన్ ఫ్రూట్ పంటకు అనుకూలంగా ఉన్నాయని, తాము కూడా సాగు చేయాలని మిత్రులకు సూచిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



డ్రాగన్‌ఫ్రూట్ తోటలో విశ్వతేజ

మాదిగల హక్కుల కోసం పోరాడుతాం



మాట్లాడుతున్న సునీల్ మాదిగ

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఎస్సీ వర్గీకరణతో పాటు మాదిగల హక్కుల కోసం పోరాడుతామని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ అన్నారు. బుధవారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ వల్లే మాదిగలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామన్నారు. మాదిగల్లో ఐక్యత పెంచడం కోసం గ్రామస్థాయి నుంచి దండోరా కమిటీలు వేస్తూ సంఘాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మాదిగ హక్కుల దండోరా నస్పూర్ మున్సిపల్ కన్వీనర్‌గా సింగాపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన అట్కపురం నమ్మయ్యను నియమించారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి రమేశ్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి కొండ్ర ఉదయ్, నాయకులు మారుపాక వెంకటేశ్, అట్కపురం సురేశ్, రమేశ్, లక్ష్మణ్, మహేశ్, భాస్కర్, మారుపాక శ్రావణ్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం



దగ్ధమైన పత్తి

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని కుశ్నపల్లిలో రైతు ఆరేళ్ల సుధాకర్‌రెడ్డికి చెందిన పత్తి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి ఈ ఏడాది తనకున్న ఆరెకరాల్లో పత్తి సాగు చేశాడు. పత్తికి మద్దతు ధర లేకపోవడంతో పత్తిని ఇంటి ఆవరణలోని షెడ్డులో నిల్వచేశాడు. బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పత్తిలో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అప్రమత్తమై బిందెలు, కుండలతో నీళ్లు పోసి మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో 30 క్వింటాళ్ల పత్తి పూర్తిగా 20 క్వింటాళ్లు పాక్షికంగా దగ్ధమైందని బాధిత రైతు వాపోయాడు. సంఘటన స్థలాన్ని నెన్నెల ఎస్సై రాజశేఖర్, ఆర్‌ఐ గణేశ్ సందర్శించి పంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

‘కంటి వెలుగు’ లక్ష్యం పూర్తి-చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న సుబ్బారాయుడు

దండేపల్లి(మంచిర్యాల): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు అన్నారు. దండేపల్లి, కొర్విచెల్మలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. శిబిరాలకు వచ్చే వారి వివరాలు, సెల్ నంబర్లు తప్పక నమోదు చేసుకోవాలన్నారు. ఆయన వెంట డాక్టర్ శోభ, హెల్త్ సూపర్ వైజర్ లక్ష్మణ్, సర్పంచ్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, వైద్య సిబ్బంది ఉన్నారు.

కొడుకు చితికి నిప్పుపెట్టిన తల్లి



సాయి కుమార్(ఫైల్)



కొడుకుకు తలకొరివి పెడుతున్న తల్లి రాజేశ్వరి

వేమనపల్లి(బెల్లంపల్లి): తన కన్నీళ్లు తుడుస్తాడనుకున్న కుమారుడు బ్రెయిన్‌స్ట్రోక్‌తో కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆతల్లి రోదనలు మిన్నంటాయి. మండలంలోని నీల్వాయికి చెందిన పున్నపురెడ్డి మధుకర్-రాజేశ్వరి దంపతులకు కుమారుడు సాయికుమార్, కూతురు పల్లవి సంతానం. సాయికుమార్ పదో తరగతి, ఇంటర్‌లో ఉన్నత శ్రేణి మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. తండ్రి మధుకర్ ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా తల్లి రాజేశ్వరి అన్నీతానై పిల్లలిద్దర్నీ చదివించింది. కుమారుడు ఢిల్లీలో ఐఐటీ పూర్తి చేసి మూడునెలల క్రితం బాష్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేరాడు. మంగళవారం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో బెంగళూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధువుల సహకారంతో మృతదేహాన్ని నీల్వాయికి తరలించారు. పుట్టెడు దుఃఖంలో తల్లి రాజేశ్వరి తలకొరివి పెట్టి అంతిమ సంస్కారాలు చేసింది.

నేటి నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, ఒకేషనల్, బీసీఏ కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 49, ఖమ్మంలో 34, ఆదిలాబాద్ జిల్లాలో 50 చొప్పున మొత్తంగా 113 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తంగా 75,869మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో ఒక చీఫ్ సూపరింటెండెంట్, అబ్జర్వర్ చొప్పున 2,663మంది సిబ్బందిని నియమించారు. ఈ నెల 9, 10, 13, 14, 15, 16, 17, 20, 21, 22వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రతీ జిల్లాలో స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. కాకతీయ యూనివర్సిటీ నుంచి కూడా ప్రత్యేకంగా స్క్వాడ్ బృందం ఉంటుంది.

సమస్యల పరిష్కారానికి ఉద్యమం



సోమగూడెంలో సమావేశమైన గ్రామస్తులు

కాసిపేట(బెల్లంపల్లి): ఓపెన్‌కాస్టు ప్రభావిత గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ కలిసికట్టుగా ఉద్యమించాలని కేకే ఓసీ బాధిత హక్కుల పోరాట సమితి సభ్యులు తీర్మానం చేశారు. బుధవారం మండలంలోని సోమగూడెం మైదానంలో ట్యాంక్‌బస్తీ, ఎన్టీఆర్‌కాలనీ వాసులు సమావేశమయ్యారు. ఓసీ బ్లాస్టింగ్‌లతో ఇబ్బందులు పడుతున్నామని, యాజమాన్యం సమస్య పరిష్కరించకపోవడంతో ఈ నెల 14న జీఎం కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సపాట్ శంకర్, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

10న రేషన్ బియ్యం వేలం

మంచిర్యాలటౌన్: పౌరసరఫరాల శాఖ అధికారులు వివిధ సందర్భాలలో తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యాన్ని ఈ నెల 10వ తేదీన బహిరంగ వేలం ద్వారా అమ్మనున్నట్లు మంచిర్యాల తహసీల్దార్ రాజేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 889.65 క్వింటాళ్ల బియ్యానికి ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు నస్పూర్ మున్సిపాలిటీలోని తీగల్‌పహాడ్ ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద వేలం ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ. 1 లక్ష దరావత్తు కట్టేందుకు సిద్ధంగా ఉండాలని, పీడీఎస్ బియ్యం, చెక్కర, గోధుమల వ్యాపారం చేసేవారు, రైస్మిల్లర్లు ఈ వేలంలో పాల్గొనేందుకు అవకాశం లేదని తెలిపారు.

కోటపల్లి(చెన్నూర్): మండల కేంద్రంలో ఇటీవల పౌరసరఫరాల శాఖ అధికారులు వివిధ సందర్భాల్లో పట్టుకున్న 60 క్వింటాళ్ల రేషన్ బియ్యానికి శుక్రవారం కోటపల్లి ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

షాదీఖానా భూమికి ఎసరు ..!

బెల్లంపల్లి: పట్టణంలోని షాదీఖానా భూమిని కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీలోని షంషీర్ నగర్‌లో బుధాకలాన్ శివారు సర్వేనంబర్ 170లో ప్రభుత్వం షాదీఖానాకోసం 1999లో రెండెకరాల భూమిని కేటాయించి పంచాయతీరాజ్‌శాఖకు అప్పగించింది. షాదీఖానా నిర్మాణానికి అప్పట్లో రూ.3.50 లక్షల నిధులు కూడా మంజూరయ్యాయి. ఖాళీ భూమిపై కన్నేసిన కొందరు అక్రమణకు పాల్పడ్డారనే విమర్శలు వచ్చాయి. ఇదే క్రమంలో కొందరు నకిలీ పత్రాల ఆధారంగా పట్టా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ వ్యక్తి సమాచారహక్కు చట్టం ద్వారా తీసుకున్న సమాచారంతో నకిలీ పట్టా వ్యవహారం వెలుగు చూసింది. వెంటనే పంచాయతీ రాజ్ అధికారులు సమగ్ర విచారణ జరిపించి అన్యాక్రాంతమైన భూమిని తిరిగి షాదిఖానా పరం చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై బెల్లంపల్లి మండల పంచాయతీ రాజ్ ఏఈ పరంజ్యోతిని ‘సాక్షి’ వివరణ కోరగా స్పందించలేదు.

ఇద్దరి రిమాండ్

వాంకిడి(ఆసిఫాబాద్): మండలానికి చెందిన ఇద్దరు నిందితులను నాన్ బెయిలబుల్ వారెంట్‌తో 15 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై డి.సాగర్ తెలిపారు. గతంలో చోరీ కేసులో పట్టుబడిన బంబార గ్రామానికి చెందిన మడావి వెంకటేశ్(22), యజాజ్ ఖాన్(25)లకు పలుమార్లు సమన్లు పంపినా కోర్టుకు హాజరుకాలేదు. ఆసిఫాబాద్ జడ్జి షరీన తీర్పు మేరకు నిందితులను ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యూడైస్ ప్లస్‌పై వర్క్‌షాప్

మంచిర్యాలఅర్బన్: యూడైస్ ప్లస్ 2023లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో డిస్ట్రిక్ స్కూల్ డైరెక్టరీ అప్‌గ్రేడేషన్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. 18 మండలాలకు చెందిన ఎంఐఎస్‌సీవోలతో సన్నాహక పనులపై వర్క్‌షాపు చేపట్టారు. జిల్లాలోని 17 మేనేజ్‌మెంట్‌లకు చెందిన 1082 పాఠశాలల వివరాలు నవీకరించనున్నారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి సప్ధర్‌అలీఖాన్, ఏఎస్‌సీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి



మాట్లాడుతున్న రాజేశ్వర్‌నాయక్

భీమారం(చెన్నూర్): వ్యవసాయ అనుబంధ రంగాలపై రైతులు దృష్టి కేంద్రీకరించాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వర్‌నాయక్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వందరోజులు పూర్తి చేసుకున్న ఈజీఎస్ కూలీలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కేవలం శారీరక శ్రమకే మాత్రమే అంకితమై ఉండకుండా వివిధ రంగాల్లో నైపుణ్యం అభివృద్ధి చేసుకొని జీవన ప్రమాణాలు పెంచుకోవాలన్నారు. వర్మీకంపోస్ట్ ఎరువు తయారీతో పాటు నర్సరీలు, తేనెటీగల పెంపకం, పౌల్ట్రీ, డెయిరీ, పుట్టగొడుగుల పెంపకం చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ శివకృష్ణ మాట్లాడుతూ రైతు సంఘాలు ఏర్పాటు చేసుకొని సంఘటితంగా పనిచేసే వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో పాటు ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో ఎస్తర్‌డేవిడ్ పాల్గొన్నారు.

మున్సిపల్‌లో అవినీతిపై ప్రతిఘటిస్తాం



మాట్లాడుతున్న కలవేని శంకర్

శ్రీరాంపూర్(మంచిర్యాల): మున్సిపాలిటీల్లో జరుగుతున్న అవినీతిపై తమ సభ్యులు ప్రతిఘటిస్తారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కలవేని శంకర్ అన్నారు. బుధవారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నస్పూర్ మున్సిపాలిటీలో పాలకపక్షం సభ్యులు అవిశ్వాస తీర్మానం పెడితే సీపీఐ మద్దతిస్తుందంటూ జరుగుతున్న ప్రచారంపై ఆయన స్పందించారు. అభివృద్ధి పనుల కోసం పాలక పక్షంతో కొట్లాడుతామన్నారు. మున్సిపాలిటీలో జరిగే అవినీతిపై తమ పార్టీ కౌన్సిలర్లు ఎప్పటికప్పుడు స్పందిస్తున్నారన్నారు. ఇటీవల నస్పూర్ మున్సిపల్‌లో రూ.50 లక్షల నిధులను దుర్వినియోగం చేయడానికి ప్రతిపాదనలు పెడితే తమ సభ్యులు తిరస్కరించి రద్దు చేయించారన్నారు. ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రేగుంట చంద్రశేఖర్, కౌన్సిలర్ మేకల దాసు, నాయకులు మిర్యాల రాజేశ్వర్‌రావు, రవి, ఆళ్ల లచ్చిరెడ్డి, రవీందర్, మొగిళి లక్ష్మణ్, హరీశ్, సన్నీ పాల్గొన్నారు.

బీట్ ఆఫీసర్ బదిలీ

భీమారం(చెన్నూర్): మంచిర్యాల అటవీ డివిజన్ పరిధిలోని భీమారం అటవీ బీట్ ఆఫీసర్ గోవింద్‌కు సెక్షన్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు బదిలీచేసినట్లు రేంజ్ ఆఫీసర్ రమేశ్ బుధవారం తెలిపారు. గోవింద్ మూడేళ్లుగా బీట్‌ఆఫీసర్‌గా సేవలందిస్తున్నారు.

గుడుంబా విక్రేతల బైండోవర్

మందమర్రిరూరల్(చెన్నూర్): వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో బెల్లంపల్లి ఆబ్కారీ శాఖ ఎస్సై నిర్మలా పాటిల్ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. ద్విచక్ర వాహనంపై గుడుంబా సరఫరా చేస్తున్న నెన్నెల మండలంలో శ్రావణపల్లికి చెందిన బుక్యా రవి, గుడుంబా ప్యాకెట్లను విక్రయిస్తున్న బానమ్మ, కావేరి, లక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. వారి నివాసాల్లో సోదా చేసి సుమారు 20 లీటర్ల గుడుంబా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ స్వప్న ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఆబ్కారీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్, కానిస్టేబుళ్లు అశోక్, దినేష్, వాహజ్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

జన్నారం(ఖానాపూర్): జన్నారం మండలం రేళ్ల గూడ సమీపంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో రోటిగూడకు చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి జాల లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలైనట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. జన్నారం నుంచి రేళ్లగూడ వైపు నడుచుకుంటూ వెళ్తున్న లక్ష్మణ్‌ను వెనుకనుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఘటనలో అతని తల, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేలాల జాతరకు ప్రత్యేక బస్సులు

మంచిర్యాలఅర్బన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంచిర్యాల ఆర్టీసీ డిపో నుంచి జైపూర్‌మండలంలోని వేలాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. వేలాల జాతరకు ఈ నెల 17 నుంచి 20 వరకు మంచిర్యాల, శ్రీరాంపూర్, కుందారం మీదుగా, చెన్నూర్ నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తామన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు రాకపోకలు సాగిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళ అదృశ్యం



మొహర్లె నిర్మల(ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): మండలంలోని కోమటిగూడ గ్రామానికి చెందిన మొహర్లె నిర్మల అదృశ్యమైనట్లు ఎస్సై డి.సాగర్ తెలిపారు. నిర్మలకు పదేళ్ల క్రితం మండలంలోని లంజన్‌వీర గ్రామానికి చెందిన సుభాష్‌తో వివాహమైంది. ఇద్దరు పిల్లలు జన్మించాక దంపతులు విడిపోయారు. అప్పటి నుంచి నిర్మల కోమటిగూడలో ఉన్న పుట్టింట్లోనే ఉంటోంది. ఈ నెల 6న ఉదయం ఆసిఫాబాద్ వెళ్లి సరుకులు తీసుకువస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికారు. అదే రోజు నుంచి చిన్న వాంకిడి గ్రామానికి చెందిన కావుడె సంపత్(28) కూడా కనిపించడంలేదని తెలిపారు. నిర్మల తల్లి అమృతబాయి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మినీ ట్రక్ చోరీ



చోరీ అయిన మినీ ట్రక్

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని చందుగూడలో రాథోడ్ హీరాలాల్‌కు చెందిన మినీట్రక్(టీఎస్01యూబీ 1008) బుధవారం తెల్లవారుజామున చోరీకి గురైనట్లు ఎస్సై నల్లా వెంకటేశ్ తెలిపారు. బాధితుడు రోజు మాదిరిగానే ఇంటి ఎదుట వాహనాన్ని పార్క్ చేశాడు. ఉదయం లేచిచూసేసరికి వాహనం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కిరాణా దుకాణంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జల్లీ మార్కెట్‌కు వెళ్లే దారిలో ఉన్న పల్లెర్ల సంతోశ్ కిరాణా దుకాణంలో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి తన షాపుకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం షాపు తెరిచేందుకు రాగా ఒకవైపు షట్టర్ తాళం పగిలి ఉంది. లోనికి వెళ్లి చూడగా క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.5వేలు, 5 ఆయిల్ క్యానలు, సీసీ కెమెరా చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మందమర్రిలో పట్టపగలే..

మందమర్రిరూరల్(చెన్నూర్): పట్టణంలోని మొదటి జోన్‌లో ఉన్న 114వ నంబర్ క్వార్టర్‌లో బుధవారం పట్టపగలే దొంగలు పడ్డారు. కాలనీకి చెందిన శ్రీనివాస్ మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి మార్కెట్‌కు వెళ్లాడు. గంట తర్వాత ఇంటికి వచ్చి తాళం తీసి చూడగా వెనుకాల తలుపులు తొలగించి ఉన్నాయి. గదిలోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. సామాగ్రి చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో దాచి ఉంచిన రూ.80 వేల నగదు, తులం బంగారు గొలుసు, పది సిల్వర్ కాయిన్స్, రెండు బంగారు రింగులు అపహరించినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. కాగా అదే కాలనీలోని మరో ఇంట్లో కూడా దొంగలు పడి కొంత నగదు దోచుకెళ్లినట్లు సమాచారం.